క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి



భట్టిప్రోలు: వరి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ బృందం డిమాండ్ చేసింది. బుధవారం ఈ బృందం భట్టిప్రోలు, అద్దేపల్లిలో వర్షాల కారణంగా నష్టపోయిన పంట పొలాలను పరిశీలించింది. ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని కోరింది. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు, బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు జి.బాలాజి, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రేపల్లె రూరల్: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు చెప్పారు. పట్టణంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను బుధవారం ఆయన పర్యవేక్షించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ హిమని, పారిశుద్ధ్య మేస్త్రులు తదితరులు పాల్గొన్నారు. రావిఅనంతవరం గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రహదారులను శుభ్రపరచటంతోపాటు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



రేపల్లె రూరల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ మాణిక్యం చెప్పారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని 7వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీలకు పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పోషక పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. పేటేరు ఎస్సీ–2 అంగన్‌వాడీ కేంద్రంలోనూ సెక్టార్ సూపర్‌వైజర్ రజని గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో సూపర్‌వైజర్ శివజ్యోతి, అంగన్‌వాడీలు వాణి, అరుణకుమారి, ఎం.ప్రేమావతి, ఎం.మోహని పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునఃసమీక్షించాలి



రేపల్లెరూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రేపల్లె న్యాయవాదుల విభాగం కోరింది. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో చేపట్టిన పోరాటానికి మద్దతుగా వర్గీకరణ ప్రతిఘటన పోరాట సమితి రేపల్లె న్యాయవాదుల విభాగం సభ్యులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. అనంతరం రేపల్లె ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు దోవా రమేష్ రాంజీ, కర్రా ప్రతాప్, నాలాది పోతురాజు, పెరికల జీవన్ కుమార్, గుమ్మడి కుమార్ బాబు, కొనకాల ప్రసాద్, ఎడ్ల గోపి రాజు, చిన్న నాంచారయ్య, కర్రా బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ, ఉపాధ్యాయునికి సత్కారం



భట్టిప్రోలు: వరదల కారణంగా భట్టిప్రోలు విశ్వశాంతి పబ్లిక్ హైస్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో 14 మంది జాతీయ స్థాయిలో ప్రతిభ సాధించడానికి కృషి చేసిన ఎంఈఓ నీలం దేవరాజుతోపాటు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు డిజిటల్ కంటెంట్ అందించడంలో విశేష కృషి చేసిన ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్‌ను అభినందించి సత్కరించారు. విశ్వశాంతి హైస్కూల్ కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారథి, ఉపాధ్యాయులు ఝాన్సీ, బోస్, పీఈటీలు పాల్గొన్నారు.



పెసర్లంక పల్లెపాలెంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పొక్లెయిన్



వెల్లటూరు-ఓలేరు రహదారిలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఈవోపీఆర్డీ ఊహారాణి, కార్యదర్శి సురేష్ తదితరులు

శుభ్రస్యశీఘ్రం

భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు గ్రామాల్లో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పారిశుద్ధ్య సిబ్బంది పనుల్లో పాలుపంచుకుంటున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలనూ శుభ్రం చేస్తున్నారు. దోమల నివారణ చర్యలు చేపడుతున్నారు. ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి మాట్లాడుతూ కొందరు సిబ్బందిని కొల్లూరు పంపడం, ఇతర ప్రాంతాల నుంచి సిబ్బందిని తీసుకురావడం వల్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, వీటిని మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. కేంద్ర బృందం బుధవారం భట్టిప్రోలు మండలంలోని ఓలేరు పల్లెపాలెం వస్తున్న సందర్భంగా యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టడం గమనార్హం. పనులను పంచాయతీ కార్యదర్శులు దీపక్, పుష్పలత, గణేష్, శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. – భట్టిప్రోలు



పెసర్లంక పల్లెపాలెం ఎంపీపీ పాఠశాల వద్ద పారిశుద్ధ్య పనులు



చింతమోటులో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పొక్లెయిన్

విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

భట్టిప్రోలు: బాపట్ల జిల్లా కలెక్టర్, డీఈఓల ఉత్తర్వుల మేరకు బుధవారం భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఆర్. సాయి నాగశ్రీ (ఐలవరం–జెడ్పీ హైస్కూల్), పి.గీతిక (భట్టిప్రోలు–టీఎంరావు హైస్కూల్), ఎస్. నవ్య (సూరేపల్లి- వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్) సాధించినట్లు ఎంఈవో నీలం దేవరాజు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, కె. శ్రీనివాస శర్మ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



భట్టిప్రోలు హైస్కూల్‌లో నిర్వహించిన వ్యాస రచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

చెరుకుపల్లి: ద్విచక్ర వాహనం నడుపుతూ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు ఏమినేనివారిపాలెం గ్రామానికి చెందిన రాయన యశ్వంత్, ఏమినేని గోపి బుధవారం సాయంత్రం 216ఏ జాతీయ రహదారిపై చెరుకుపల్లి వైపు నుంచి పొన్నపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తూ పొన్నపల్లి యూనియన్ బ్యాంక్ సమీపంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొనటంతో బైక్ రోడ్డుపై పడిపోయి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు దగ్గరలోని వైద్యశాలకు తరలించగా అనంతరం మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం 108 సాయంతో తెనాలి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శిశువు కొనుగోలుపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): శిశువును కొనుగోలు చేసిన అంశంలో జీరో ఎఫ్ఐఆర్ కట్టిన పోలీసులు కేసును చినగంజాం పోలీసు స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేసిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. కొత్తపేట పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా భట్టిప్రోలు గ్రామానికి చెందిన మీరాబి అనే మహిళ గత కొద్ది రోజుల క్రితం డెలివరీ నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చేరింది. ఆమెతో పాటు ఆమె స్నేహితురాలు ప్రభావతిని సాయంగా తీసుకొచ్చింది. అయితే డెలివరీ సమయంలో పుట్టిన శిశువు మృతిచెందింది. దీంతో మీరాబి నిత్యం బాధపడుతుండటంతో జీజీహెచ్‌లో చికిత్స అందజేస్తున్నారు. అదే సమయంలో చినగంజాంకు చెందిన లక్ష్మీ అనే బాలింత జీజీహెచ్‌లో చేరింది. కొద్దిరోజుల తరువాత ఆడ శిశువు జన్మించిన లక్ష్మీ అనారోగ్యంతో మృతిచెందింది. లక్ష్మీ మృతిచెందిన విషయాన్ని గమనించిన మీరాబి స్నేహితురాలు ప్రభావతి మీరాబి బాధ చూడలేక చినగంజాం వెళ్లి లక్ష్మీ భర్త సుబ్రహ్మణ్యంతో మాట్లాడి ఈనెల 7న రూ. 2 లక్షలకు ఇస్తామని చెప్పి లక్ష్మీకి పుట్టిన ఆడ శిశువును తీసుకొచ్చింది. అప్పటికే ఎనిమిది మంది సంతానం ఉన్న సుబ్రహ్మణ్యం శిశువును ఇచ్చేందుకు అంగీకరించాడు. అయితే మీరాబికి పుట్టిన శిశువు మృతిచెందిన విషయం తెలిసి ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది బతికి ఉన్న శిశువు ఉండటాన్ని గమనించారు. ఈ శిశువు ఎక్కడిదని ఆమెను ప్రశ్నించారు. దీంతో మీరాబి, ప్రభావతి పూర్తి విషయాన్ని జీజీహెచ్ సిబ్బందికి తెలిపారు. దీంతో ఆసుపత్రి వర్గాలు కొత్తపేట పోలీసులకు పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను చినగంజాంకు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు.

భూముల రికార్డులు సరిచేయాలని వినతి

తెనాలిరూరల్: భూములు రెవెన్యూ రికార్డుల్లో దేవదాయ శాఖ భూములుగా కనబడుతున్నాయని, వెంటనే సరిచేయాలని తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన సుమారు 60 మంది రైతులు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను బుధవారం రాత్రి కలసి విజ్ఞప్తి చేశారు. 1930 నుంచి గ్రామ పరిధిలోని భూములు తమ పేరిట ఉన్నాయని, అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల పత్రాలు, పాస్‌పుస్తకాలు తమ వద్ద ఉన్నాయని తహసీల్దార్‌కు విన్నవించారు. తమ భూములను 2019లో దేవాయ శాఖ అధికారులు ఆ శాఖకు చెందిన భూములంటూ గ్రామస్తుల దృష్టికి తీసుకొచ్చారని, ఎవరికి ఎటువంటి నోటీసులివ్వకుండా రెవెన్యూ శాఖతో కలసి భూములను దేవదాయ శాఖకు చెందినవిగా రికార్డుల్లో మార్పులు చేశారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుని రికార్డుల్లో మార్పులు చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనికి తహసీల్దార్ సమాధానమిస్తూ రైతుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అనాథ శవానికి అంతిమ సంస్కారాలు

తెనాలి: పట్టణ స్వరాజ్ టాకీస్ సెంటర్లోని సాయిబాబు గుడి వద్ద మూడు దశాబ్దాలుగా భిక్షాటనతో జీవనం సాగిస్తున్న వృద్ధుడు మంగళవారం రాత్రి పొద్దుపోయాక మృతిచెందాడు. అతడు అనాథ కావటంతో సాయిబాబా గుడి కమిటీ విజ్ఞప్తి మేరకు పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం అంత్యక్రియలు చేశారు. సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు కలిసి, యాచకుడి మృతదేహాన్ని బుర్రిపాలెంరోడ్డులోని మహాప్రస్థానానికి తరలించారు. సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవా సమితి అనాథ శవాలకు చేస్తున్న అంతిమ సంస్కార సేవలను మహాప్రస్థానం సేవాసమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ అభినందించారు. గుంటూరుకు చెందిన స్వామి జ్ఞానప్రసన్న ఆశీస్సులతో ఆరేళ్లుగా ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయటం, అనాథలు, నిస్సహాయులుగా మరణించినవారికి అంత్యక్రియలను చేస్తున్నట్టు కుర్రా శ్రీను తెలిపారు. వీరి అస్తికలను తీసుకుని కాశీలోని గంగానదిలో నిమజ్జనం, పిండప్రదానం చేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పాలడుగు బ్రహ్మం పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్యంతో ఆరోగ్యంపై దుష్ప్రభావం


తెనాలిరూరల్: వాతావరణ కాలుష్యం ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోందని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు అన్నారు. వాతావరణ కాలుష్యం, దుష్ప్రభావాలపై కొలకలూరులో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని చెప్పారు. వాయు కాలుష్యంతో ఊపిరితిత్తులకు సంబంధించి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఊపిరితిత్తులు, గుండె సమస్యలు ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని, వాయు కాలుష్యం ఉన్న ప్రదేశాలకు వెళ్లకపోవడం మేలన్నారు. సిగరెట్లు తాగడం, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రదేశాలకు వెళ్లడం, బాణసంచా కాల్చడం వంటి పనులు చేయకూడదని సూచించారు. లక్ష్మీప్రసన్న, ఎం.వెంకటరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ర్యాలీలో పాల్గొన్నారు.



ర్యాలీలో డాక్టర్ సుబ్బారావు, సిబ్బంది

బాబు అసమర్థత వల్లే బెజవాడ ముంపు

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్ ధ్వజం



రేపల్లె రూరల్: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విజయవాడ వరద ముంపునకు గురైందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆరోపించారు. మంగళవారం గుళ్లపల్లిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసమర్థతతో పది రోజులుగా విజయవాడ ముంపు బాధితులు నరకయాతన అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు ఆహారం, తాగునీరు అందించటంలోనూ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని స్పష్టం చేశారు.

ముమ్మాటికీ బాబు ఇంటి కోసమే!

సీఎం బాబు తన ఇంటితోపాటు ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ ప్లాంట్ ముంపునకు గురికాకుండా ఉండేందుకే బుడమేరు వాగు గేట్లను ఎత్తి వరదను విజయవాడవైపు మళ్లింపజేశారని ఈవూరు గణేష్ విమర్శించారు. వాతావరణ శాఖ, సంబంధిత అధికారులు ముందుగానే హెచ్చరికలు జారీ చేసినా చంద్రబాబు పెడచెవిన పెట్టారని దుయ్యబట్టారు. పేదల సంక్షేమం బాబుకు పట్టదని, పెత్తందార్ల అభివృద్ధే ముఖ్యమని మరోమారు రుజువు చేశారన్నారు. బుడమేరు గేటు ఎత్తే ముందు విజయవాడలో కనీస హెచ్చరికలు జారీచేసినా ముంపు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లే వారని పేర్కొన్నారు.

బాబు తీరు ఆడలేక మద్దెలఓడు..

బాధితులను ఆదుకోలేక సమస్యను పక్కతోవ పట్టించేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులపై చంద్రబాబు, ఆయన మంత్రి వర్గం విమర్శలు చేయటం తగదని గణేశ్ పేర్కొన్నారు. బాబు తీరు ఆడలేక మద్దెలఓడు అన్నట్టు ఉందని దుయ్యబట్టారు. బాబు తానా అంటే తందానా అనేలా ఎల్లో మీడియా ప్రజా సమస్యలను తొక్కిపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచాన్ని తలదన్నే రాజధాని అమరావతి అని నిత్యం ప్రగల్భాలు పలికే బాబు పది రోజులుగా వరద ముంపులో ఉన్న అమరావతిని కాపాడలేకపోయారన్నారు. ఇదేనా బాబు విజనరీ అని ప్రశ్నించారు. విజయవాడ వరద ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గణపయ్యకు నిమజ్జనోత్సవం



నర్రావారిపాలెంలో నిమజ్జనానికి తరలి వెళుతున్న గణపయ్య



నగరంలో ఊరేగుతున్న గణనాథుని విగ్రహం

కర్లపాలెం/నగరం: గణపతి నిమజ్జనోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. కర్లపాలెం మండలం నర్రావారిపాలెం, పాతనందాయపాలెం, ఎంవీరాజుపాలెం గ్రామాలలో పూజలందుకున్న విఘ్నేశ్వరుని విగ్రహాలు బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఈ సందర్భంగా గ్రామోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. నగరం మండలంలోని నగరం, మీసాలవారిపాలెం, దాసరిపాలెం గ్రామాల్లోనూ గణపతి విగ్రహాలకు నిమజ్జనోత్సవాలు జరిగాయి.

వరద బాధితులకు ఆపన్నహస్తం

భట్టిప్రోలు/రేపల్లె రూరల్/కర్లపాలెం: వరద బాధితులకు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆపన్నహస్తం అందిస్తున్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన ఎమ్మార్పీసీటీ నిర్వాహకులు, పాస్టర్ పల్లికొండ రత్నం అండ్ బ్రదర్స్ బుధవారం క్రీస్తులంకలో 500 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. లంక గ్రామాల్లో 11 రోజులుగా భోజనం పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రకాష్, రాజు, రమేష్‌బాబు పాల్గొన్నారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో 57 మంది దైవ సేవకుల కుటుంబాలకు పెదపులివర్రులోని పెంతెకోస్తు ప్రార్థనా మందిరంలో భట్టిప్రోలుకు చెందిన పాస్టర్ ఎస్.గిరి ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఆనందరావు, గోపీ, నిరీక్షణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఓలేరు పల్లెపాలెంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమ్మకేర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 130 కుటుంబాలకు 130 దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ మణిలాల్, ట్రస్ట్ సభ్యులు దుర్గారావు, భార్గవి, సీఐటీయూ మండల కార్యదర్శి జి.సుధాకర్, అంగన్‌వాడీ యూనియన్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీ, సీహెచ్ ఆదిలక్ష్మి, వెంకట లక్ష్మి, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

● వరద బాధితుల సహాయార్థం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ విద్యార్థులు బుధవారం పురవీధులలో విరాళాల సేకరణ చేపట్టారు. విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ఎంఈఓ నీలం దేవరాజు, హెచ్ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో మురళీధర రావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, లక్ష్మి ప్రసన్న, రమ్య తదితరులు పాల్గొన్నారు.

● ఢిల్లీకి చెందిన అమ్మ కేర్ చారిటబుల్ ట్రస్ట్ పెనుమూడి పల్లెపాలెంలో ప్రజాసంఘాల సహకారంతో అందించిన దుప్పట్లను టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ బుధవారం 150 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, అమ్మ కేర్ ట్రస్ట్ సభ్యుడు దుర్గారావు, ప్రజాసంఘాల నాయకులు ఝాన్సీ, ఆదిలక్ష్మి, వెంకట లక్ష్మి, రామారావు, ధర్మరాజు, ఆశీర్వాదం, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● విజయవాడ వరద బాధితులకు కర్లపాలెం మండల పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ బాషా ఆధ్వర్యంలో బుధవారం ముస్లింలు భోజనం తీసుకువెళ్లి పంపిణీ చేశారు. విజయవాడలోని రామకృష్ణాపురం మదికట్ట, దేవీనగర్, సింగ్‌నగర్ గ్రామాలలోని పునరావాస కేంద్రాలలోని బాధితులకు భోజనం అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుంపుల కన్నయ్య, షేక్ రహ్మతుల్లా, జానీ, షేక్ ఇబ్రహీం, షేక్ అబ్దుల్ కలాం, షేక్ జిలానీ, కరీమా, కరిముల్లా, తాడికొండ వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్, కలీం తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె మండలం పెనుమూడిలో బాధితులకు దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం



క్రీస్తు లంకలో వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



పెదపులివర్రులో నిత్యావసరాల పంపిణీ



ఓలేరు పల్లెపాలెంలో..



భట్టిప్రోలులో విద్యార్థుల విరాళాల సేకరణ

పోషకాహార ప్రదర్శన



భట్టిప్రోలు: భట్టిప్రోలు సెక్టార్ పరిధిలో బుధవారం పోషకాహార మాసోత్సవం పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జె.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.